క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివ

కురిచేడు: మండలంలోని ఎన్ఎస్‌పీ అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎస్ఐ ఎం.శివ బుధవారం సందర్శించారు. 7,8,9వ తరగతి విద్యార్థినులకు బాలికల భద్రత, మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు అనే విషయాలపై అవగాహన కల్పించారు. ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఏ అవసరమైనా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. బాలికల రక్షణ కోసం ఉన్న చట్టాల గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయుడు మాలకొండయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో దివ్యాంగ విద్యార్థికి అడ్మిషన్



దివ్యాంగ విద్యార్థిని సన్మానిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

యర్రగొండపాలెం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యశించిన విభిన్న ప్రతిభావంతుడు షేక్ షాబీర్‌బాషా నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించాడు. ఈ సందర్భంగా బుధవారం ఎంఈవో పి.ఆంజనేయులుతో పాటు ఆ పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆ విద్యార్థికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఇటువంటి ఘనత సాధించడం మండలానికి గర్వకారణమని ఎంఈవో అన్నారు. ఆ పాఠశాల ఉపాధ్యాయుడు టి.వీరాచారి రూ.1000 అందజేసి షాబీర్‌బాషాను అభినందించారు. హెచ్ఎం యూ.నాగరాణి, ఐఈ కో ఆర్డినేటర్ నాగేంద్ర నాయక్, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ సాధిక్, టి.వీరాచారి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసేందుకే పైపుల తరలింపు

● ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సురేష్‌బాబు



ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యర్రగొండపాలెం: నీటి సరఫరా కోసం మార్కాపురం రోడ్డులో ఉన్న పైపులను సద్వినియోగం చేసేందుకే చందవరం స్కీంకు తరలిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ పొదిలి డివిజన్ ఈఈ సురేష్‌బాబు స్పష్టం చేశారు. బుధవారం భూమిలో వేసిన పైపులు ఏ మేరకు తొలగించారన్న విషయంపై ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పైపులైన్‌ను ధ్వంసం చేయకుండా పట్టణ ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చే విధంగా ప్రత్యామ్నాయ లైన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, సర్పంచ్ ఆర్.అరుణాబాయితో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఈఈని కోరారు. కాంట్రాక్టర్ ఒకటిన్నర కిలో మీటర్ల మేర పైపులు భూమిలో నుంచి వెలికితీసి తరలించుకోవచ్చని అధికారులు ఇచ్చిన అనుమతిని ఉల్లంఘించాడని, అదనంగా మరో రెండు కిలో మీటర్ల వరకు పైపు లైన్ ఉన్న ప్రాంతంలో గోతులు తీశాడని ఆరోపించారు. తమ ప్రాంతానికి కేటాయించిన సాగర్ నీటి పైపులు తొలగించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. మన్నిక కలిగి ఖరీదైన పైపులు కొంతమంది టీడీపీ నాయకులు తమ జేబులు నింపుకోవటానికి ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. తరలించిన పైపులపై విచారణ చేపట్టాలని, వెలికితీసిన పైపులను ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో భద్రపరచాలని కోరారు. నిబంధనలకు లోబడి తాము నిరుపయోగంగా భూమిలో ఉన్న పైపులను తరలిస్తున్నామని, అదనంగా పైపులు తరలించి ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఈఈ అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఓబులరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములునాయక్, నాయకులు సయ్యద్ జబీవుల్లా, ఒంగోలు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆటోలతో అవస్థలు

● ప్రయాణికుల కోసం వెనక్కి..ముందుకు చక్కర్లు
● రోడ్లపైనే యూ టర్న్‌లు తీసుకుంటున్న ఆటోవాలాలు



నడిరోడ్డుపై యూటర్న్ తీసుకుంటున్న ఆటోవాలా ప్రయాణికుల కోసం చక్కర్లు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని పలు సెంటర్లు, రహదారుల్లో కొన్ని ఆటోలు తమ ఇష్టారీతిన సంచరిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. పట్టించుకునే వారెవ్వరూ లేరంటూ రహదారులను కూడా సగానికిపైగా ఆక్రమించుకుని ఆటోవాలాలు పలువురికి ఇబ్బందులు కలిగిస్తున్నారు. దీంతో మండల కేంద్రంలోని ముఖ్య కూడలిగా ఉన్న నటరాజ్ సెంటర్‌లో ట్రాఫిక్‌కు, ఆర్టీసీ బస్సులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగిస్తున్నాయి. మండల కేంద్రంలోని నటరాజ్ సెంటర్, కర్నూల్ రోడ్డు, రవి మెడికల్ షాపు ఎదుట రోడ్డును ఆక్రమించుకుని ప్రయాణికులను ఆకర్షించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తుంటారు. దీంతో పాటు ఫారెస్టు చెక్‌పోస్టు, తహసీల్దార్ కార్యాలయం రోడ్డు, పాత పెట్రోల్ బంక్, శ్రీశైలం బస్టాండ్ తదితర ప్రాంతాల్లోని బస్ స్టాపులను టార్గెట్ చేస్తూ ప్రయాణికులను ఆకర్షిస్తూ వారిని ఆటోల్లో ఎక్కించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సులు వచ్చినా వారికి సైడు ఇవ్వక పోతుండటంతో పలువురు బస్ డ్రైవర్లు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

ప్రయాణికులను ఆకర్షించేందుకు ఒకరితో ఒకరు పోటీ పడుతుండటంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇందు కోసం తమ ఆటోలను అటు..ఇటూ, ముందుకు..వెనక్కి తిప్పుతుండటంతో ఒక్కోసారి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో పాదచారులు, వాహనదారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో కొందరు ఆటోడ్రైవర్లు రోడ్డు ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా రోడ్లపైనే యూ టర్న్‌లు తీసుకుంటున్నారు. దీంతో రోడ్డుకు అడ్డంగా ఆటోలను తిప్పుతుండటంతో అనుకోని రీతిలో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందంటూ పలువురు వాపోతున్నారు. దీంతో పాటు ముందూ వెనుకా చూసుకోకుండా అడ్డంగా తిప్పుతుండటంతో వెనుకగా వచ్చే వాహనాలు ఢీకొనే పరిస్థితులు ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు. దీంతో పాటు కొన్ని ఆటోల్లో మితి మీరిన శబ్దంతో పాటలను పెట్టి శబ్ద కాలుష్యాన్ని కలిగిస్తున్నారు.

రోడ్లపైనే యూ టర్న్‌లు

పోలీసులు క్రమం తప్పకుండా ఆటోల్లో తనిఖీలు నిర్వహిస్తూ చలానాలు విధిస్తున్నా కొందరు ఆటో డ్రైవర్లు మాత్రం పద్ధతి మార్చుకోవటం లేదంటూ పలువురు విమర్శిస్తున్నారు. రోడ్లపైనే అడ్డంగా యూటర్న్‌లు తీసుకోవటం, రాక పోకలపై అడ్డంకులు కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికార పార్టీ మోసాలను ఎండగట్టాలి



మాట్లాడుతున్న వెన్నపూస వెంకటరెడ్డి

దర్శి: అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. మండల స్థాయిలో ఆయా విభాగాల్లో పదవులు కేటాయింపుపై చర్చించారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ పదవులు పొందిన వారు ఆయా విభాగాల్లో సమస్యలు ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకు రావాలని సూచించారు. కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా శివన్న అండగా ఉండి తగు న్యాయం చేస్తున్నారన్నారు. ప్రతి కార్యకర్త ధైర్యంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కూటమి అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా ఇంకా అది చేస్తాం, ఇది చేస్తాం అని మాటలకే పరిమితమైందన్నారు. ప్రధాన హామీలు కూడా అమలు చేయకుండా ప్రజలను దారుణంగా మోసగించిందన్నారు. గత జగనన్న పాలనకు ఇప్పటి కూటమి పాలనకు తేడాను ప్రజలు గమనించారన్నారు. కూటమిపై తీవ్ర వ్యతిరేకత ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు ముత్తినీడి సాంబయ్య, కౌన్సిలర్‌లు మేడం మోహన్‌రెడ్డి, తుళ్లూరి బాబూరావు, ఆవుల జ్యోతి శివారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి, లీడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కేవీరెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు అంకాల నాగయ్య, పాశెం మజ్జువలి, చెరుకూరి జగన్, అన్నవరపు రవి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ షకీలా అమీన్‌బాషా, నాయకులు మేడగం బాలకృష్ణారెడ్డి, రామకృష్ణ, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, పాశం సురేష్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

పుల్లలచెరువు: విద్యార్థులు చెడు వ్యవనాలకు దూరంగా ఉండాలని, అప్పుడే భవిష్యత్ అద్భుతంగా ఉంటుందని ఎస్ఐ సంతప్‌కుమార్ సూచించారు. ఎస్పీ దామోదర్ ఆదేశాలపై ప్రతి పాఠశాలలో అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు లైంగిక వేధింపులు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం డ్రగ్స్, మత్తు పదార్థాలు, బాల్య వివాహాలు, నేరాలు, ఈవ్‌టీజింగ్, ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాలపై అవగాహ కల్పించడంతో పాటు ప్రస్తుతం సమాజంలో విద్యార్థులు, యువకులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. సైబర్ నేరాలు, ఫేక్ ఎస్ఎంఎస్‌లు, ఓటీపీ మోసాలు, లింక్ మేసేజ్‌లు, తాజాగా డిజిటల్ అరెస్టులు పేరుతో జరుగుతున్న మోసాలు వివరించారు. అబ్బాయిలు, అమ్మాయిలతో ఎలా ప్రవర్తించాలనే విషయాలను కూడా వివరించినట్లు తెలిపారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాల వినియోగంతో భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. అత్యవసరం అనుకుంటే వెంటనే 100, 112 నంబర్లకు ఫోన్ చేసి పోలీసుల సహాయం తీసుకోవాలని ఎస్సై సంపత్ కుమార్ సూచించారు. హెచ్ఎం ప్రభూజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలి



మాట్లాడుతున్న మలేరియా అధికారి

దర్శి: ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని మలేరియా అధికారి డాక్టర్ బసవారెడ్డి అన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు దర్శి మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో తూర్పు వెంకటాపురం, రాజంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు డెంగీపై బుధవారం అవగాహన కల్పించారు. బసవారెడ్డి మాట్లాడుతూ ఇంట్లో, చుట్టుపక్కల ఎక్కువ రోజులు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. తొట్లు, డ్రమ్ములు, ప్లాస్టిక్ గ్లాస్‌లు, టైర్స్‌లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. ప్రతి శుక్రవారం నీరు నిల్వ ఉంచే పాత్రలన్నీ ఎండబెట్టి మళ్లీ నీళ్లు పట్టుకోవాలని సూచించారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

చిన్నకండ్లేరు ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టాలి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

పుల్లలచెరువు: మండల కేంద్రంలో ఉన్న చిన్న కండ్లేరు ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ సీనియర్ నాయకులు చెన్నయ్య డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ బృందం చిన్నకండ్లేరు ప్రాజెక్టును సందర్శించి అనంతరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిప్రతం అందజేసింది. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ మూడు సంవత్సరాల క్రింతం ప్రాజెక్టుకు గండి పడటంతో నీరు వృథాగా పోయిందని, అప్పటి మంత్రి చెరువును పరిశీలించి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారని, అప్పటి నుంచి ఎవరూ పట్టించుకున్న వారే లేరన్నారు. ఇప్పటికీ నీరు లీకు అవుతూ వృథాగా పోతున్నాయని పేర్కొన్నారు. తూములు సక్రమంగా లేకపోవడంతో చెర్వు కట్టపై తుమ్మచెట్లు పెరిగి ఇబ్బందికరంగా ఉందని, ఈ చెర్వులో నీరు లేకుంటే ఆయకట్టు రైతులు నష్టపోతారని, అధికారులు, ప్రజానాయకులు ప్రాజెక్టుపై శ్రద్ధ చూపి నిధులు కేటాయించేలా కృషి చేయాలని, ప్రాజెక్టుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణగౌడ్, మండల కార్యదర్శి గురునాథం పాల్గొన్నారు.

రెండు బైకుల ఢీ.. ఒకరికి గాయాలు



గాయపడిన చక్రి

కురిచేడు: ఎదురుఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. 108 సిబ్బంది కథనం ప్రకారం.. దర్శి మండలం కట్టుబడిపాలెం గ్రామానికి చెందిన మాదాసి చక్రి తన అత్తగారి గ్రామం త్రిపురాంతకం ద్విచక్ర వాహనంపై బయల్దేరి వెళ్తున్నాడు. మండలంలోని పడమర నాయుడుపాలెం గ్రామానికి చెందిన రమేష్ తన అత్తగారి గ్రామం మండలంలోని ఎన్ఎస్పీ అగ్రహారం తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. కురిచేడు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో రెండు వాహనాలు ఢీకొనడంతో చక్రికి గాయాలయ్యాయి. కుడికాలు విరిగింది. ముఖానికి స్వల్ప గాయాలయ్యాయి. 108కి సమాచారం అందించటంతో సిబ్బంది మహబూబ్‌బాషా, వెంకటప్పయ్యలు క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



విద్యార్థుల రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవోలు

పుల్లలచెరువు: గ్రామాల్లో డ్రాపౌట్లు లేకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈవోలు ఇందిర, ఖాసిం అన్నారు. మండలంలోని గంగవరం, మల్లాపాలెం, ఉమ్మడివరం, తెల్లగట్ల పాఠశాలలను వారు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలు, నోట్‌పుస్తకాలు, రికార్డులు, పాఠశాల ఆవరణను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వారిలో విషయ పరిజ్ఞానాన్ని పెంచే విధంగా చూడాలన్నారు. రికార్డులు కూడా సక్రమంగా నిర్వహించాలన్నారు. పి4 కార్యక్రమంలో భాగంగా ప్రతి ఉపాధ్యాయుడు ఒక్క కుటుంబాన్ని దత్తత తీసుకుని వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించి తాము ఉన్నామనే భరోసా కల్పించే విధంగా ఉండాలన్నారు. మధ్యాహ్న భోజనం కూడా పరిశుభ్ర ప్రదేశంలో రుచిగా ఉండేలా చూడాలన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి



కరపత్రాలు చూపుతున్న రైతులు



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

పుల్లలచెరువు: రైతులు భూసార పరీక్షల ఆధారంగా పంటలకు ఎరువులు, మందులు వాడితే పెట్టుబడి తగ్గి అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకట రమణ అన్నారు. మండలంలోని యండ్రపల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి క్షేత్ర స్థాయిలో సాగు పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. వెంకట రమణ మాట్లాడుతూ మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని, విత్తనాలు వేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. జిల్లా జలవనరుల ఏవో శైలజ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడుకోవాలన్నారు. జీవన ఎరువుల ప్రాముఖ్యత గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఏవో గోపీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

దొనకొండ: గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద సబ్సిడీపై కంది విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ తెలిపారు. మండలంలోని సంగాపురం, వద్దిపాడు గ్రామాల్లో రైతులతో ఆయన బుధవారం మాట్లాడారు. కంది విత్తనాలు కావాల్సిన రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు. కౌలుదారులు కౌలుకార్డులు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి వీఆర్‌ఓల నుంచి కౌలు కార్డులు పొందాలని సూచించారు. క్రాప్ ఇన్సూరెన్స్‌పై రైతులకు అవగాహన కల్పించారు. సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా రైతులు పంట వేసినట్లు సర్టిఫికెట్ పొందాలన్నారు. పత్తికి రూ.2100, కందికి రూ.430, మిరప పంటకు రూ.4500 ఈ నెల 31లోపు చెల్లించాలని వ్యవసాయాధికారి రైతులకు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

కురిచేడు: ఈ సంవత్సరం రైతులు పొగాకు పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలైన కంది, మినుము, సజ్జ సాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ తెలిపారు. మండలంలోని కురిచేడు, పేరంబోట్లపాలెం గ్రామాల్లో సాగు చేసిన ఉద్యానవన పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ కంది పంట సాగు చేసే రైతులు మధ్యలో అంతర్ పంటగా జొన్న లేదా పెసర, మినుములను వేసుకోవాలని తెలిపారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడితే అధిక దిగుబడితో పాటు నేల సారవంతాన్ని కాపాడవచ్చని తెలిపారు. పంటల బీమా గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ సహాయకులు వెంకటేశ్వర్లు, సుచరిత, మేరీ, తేజస్వి పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

● 12 బాటిళ్లు స్వాధీనం



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పెద్దబొమ్మలాపురంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని అతని వద్ద 12 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ వెంకటరెడ్డి మాట్లాడుతూ దాడుల అనంతరం లైసెన్స్‌దారులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు లైసెన్స్‌దారులే మద్యం విక్రయాలు జరపాలని సూచించారు. అలా కాని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బైకును ఢీకొట్టిన టాటా ఏస్



తీవ్రంగా గాయపడిన సుబ్బయ్య

దొనకొండ: ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని టాటా ఏస్ ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన స్థానిక కేజీబీవీ పాఠశాల సమీపంలోని మూలమలుపు వద్ద బుధవారం జరిగింది. వివరాలు.. ఇండ్లచెరువు గ్రామానికి చెందిన బోయపాటి సుబ్బయ్య దొనకొండలో ఆటో మొబైల్ షాపు నడుపుతున్నాడు. ఈ క్రమంలో షాపు వద్దకు వెళ్లేందుకు స్వగ్రామం ఇండ్లచెరువు నుంచి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. ఎదురుగా వేగంగా వెళ్తున్న టాటా ఏస్ ఢీకొట్టడంతో కుడికాలు, కుడి చేయి పూర్తిగా విరిగాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ఈఎంటీ వెలుగొండయ్య, పైలట్ ప్రసాదరావులు ప్రథమ చికిత్స చేసి స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించారు.

పదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కురిచేడు: స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 10వ తరగతిలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రన్సిపాల్ కె.ఆరోన్‌బాబు తెలిపారు. ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు స్థానిక గురుకులంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. 10వ తరగతిలో ప్రవేశానికి 9వ తరగతి 60 శాతం మార్కులతో పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆధార్ కార్డుతో గురుకులంలో కలవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

బాలగంగాధర్ తిలక్‌కు ఘన నివాళి



తిలక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈఓ

పెద్దారవీడు: మండలంలోని కర్రోల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గుర్రపుసాల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం బాలగంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంఈఓ సుబ్రహ్మణ్యం పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్, సుఖదేవ్‌లతో కలిసి సాయుధ పోరాటం చేసి ప్రాణాలర్పించిన ధీరుడు బాలగంగాధర్ తిలక్.. అని కొనియాడారు. దేశభక్తికి నిలువెత్తు నిదర్శనం, స్నేహానికి చెరగని చిరునామా, ఆదర్శవంతమైన నాయకుడు, భారత ముద్దుబిడ్డ తిలక్.. అని పేర్కొన్నారు. స్కూల్ కాంప్లెక్స్ చెర్మన్ షేక్ అహ్మద్, ఉపాధ్యాయులు సాయి, గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.



త్రిపురాంతకేశ్వరస్వామికి ఘటాభిషేకం



కుండలతో నీరు తెస్తున్న మహిళలు



శాకంబరి అలంకారంలో పార్వతీదేవి

వైభవంగా ఘటాభిషేకం

త్రిపురాంతకం: శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయంలో ఘటాభిషేకం, శాకంబరి అలంకారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు పండితులు వైభవంగా నిర్వహించారు. త్రిపురాంతకం దేవస్థానంలో ఆషాడ మాసం మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తజనులు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, పట్టువస్త్రాలతో సారెను మంగళ వాయిద్యాలతో గ్రామం నుంచి తీసుకొచ్చారు. శ్రీపార్వతి దేవి అమ్మవారు ప్రత్యేకంగా శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామికి ఘటాభిషేకం భక్తులతో వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఆశీర్వచనం అందించి అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు.